
# పండంటి పాపాయి



జి. ఉషావిఠల్

దగ్గరగా పొడి దగ్గు విని లలిత చటుక్కున తలెత్తి చూసింది. ప్యూన్ రాజు చేతిలో తాళాల గుత్తితో, 'ఆఫీసంతా ఖాళీ అయింది. తమరు కూడా దయచేస్తే ఆఫీసుకి తాళాలు వేసేసి, నేనూ పోతాను', అన్నట్లు చూస్తూ టేబుల్ దగ్గర నిల్చుని ఉన్నాడు. చేతిలోని ఫైల్ని మూసేసి టేబిల్ మీద పెడుతూ,

"సారీ! రాజు! నావల్ల నీకు ఆలస్యం అయి పోయినట్లుంది." అంది. రాజు చిరునవ్వుతో,

"ఫరవాలేదమ్మగారూ!" అన్నా చూపుల్లో ఎక్స్ప్రెషన్స్ మాత్రం మారలేదు. డ్రాయరు సొరుగు లోంచి హేండ్ బేగ్ తీసుకుని బైటికి నడిచింది. అయిదు గంటలు దాటి పదిహేను నిముషాలు గడిచాయో లేదో ఆఫీసంతా నిర్మానుష్యంగా తయారైంది. ఆఫీసు వదలడానికి అయిదు నిముషాల ముందరే టేబిల్ మీది కాగితాల్ని సర్దేసి, ఇంట్లో తమ కోసం యెదురు చూసే పిల్లా జెల్లల్ని భర్తల్ని భార్యల్ని కలుచుకుంటూ వురుకులు, పరుగులతో ఆఫీసు వదిలేస్తారు స్టాఫంతా. ఇప్పట్నించీ ఇంటికి వెళ్లి యేం చెయ్యాలి? అనుకుంటూ లలిత పనిలో మునిగిపోతూ ఉంటుంది. చీకటి ముసురుకుంటున్న గదుల్లోకి వంటరిగా అడుగుపెట్టాలి అన్న విషయం తలుచుకుంటూ వుంటే లలిత అడుగులు ముందుకి పడటం లేదు. మోహన్ కేంప్కి వెళ్లినప్పుడల్లా ప్రపంచంలోని ఒంటరితనం అంతా తనని చుట్టు ముట్టేసినట్లు ఉంటుంది. నిట్టూరుస్తూ బస్టాపులోకి వచ్చి నిల్చుంది. ఆఫీసులు వదిలిన వేళేమో బస్టాపు జనంతో కిటకిటలాడుతోంది. ఎటు వెళ్లే బస్సు వచ్చినా జనం చీమలపుట్టల్లా ఒక దగ్గర చేరిపోతున్నారు. కాలు గూడా పెట్టడానికి సందులేని బస్సుల్లోకి యెలాగో జొరబడిపోతున్నారు. లలితకి యింటికి వెళ్లి చెయ్యాల్సిన పనేమీ లేదు. అందుకే జనానికి కాస్త దూరంలో నిల్చుంది. ఆమె వెళ్లాల్సిన బస్సులు రెండు వెళ్ళిపోయాయి. మూడో బస్సు ఖాళీగా ఉంటుందేమో చూద్దాం! అనుకుంటూ పరధ్యానంగా నిల్చుంది.

"ఇదిగో! మిమ్మల్నే! అదెవరో పిలుస్తున్నారు, చూడండీ!" ఆమెకి కొంచెం దూరంలో నిల్చున్న అమ్మాయి కేకేసి చెప్పేసరికి, తననేనా? అనుకుంటూ అటు చూసింది. బస్టాప్కి కొంచెం దూరంలో ఆగి ఉన్న ఎర్రటి మారుతీ కారులో నించి తల బైటికి పెట్టి చెయ్యి ఊపుతోందొక స్త్రీ! లలిత సందేహిస్తూనే ముందుకు నడిచింది.

"హమ్మయ్య! దూరం నించి చెయ్యి ఊపానే గాని నువ్వు లలితవో, కావో అనుకుంటున్నాను." అంది కారులోని స్త్రీ, తన అంచనా తప్పలేదన్న సంతోషంతో. లలిత కూడా ఆమెని గుర్తుపట్టి, "స్వప్నా!" అంది ఆశ్చర్యంగా.

"గుర్తుపట్టావన్నమాట! కమాన్! ఇక్కడ కారు యెక్కువ సేపు నిలబెట్టడానికి లేదు" అంటూ తలుపు తెరిచింది. లలిత మంత్రముగ్ధలాగా కారు యెక్కి స్వప్న పక్కన కూర్చుంది. ఎప్పుడో పది పన్నెండేళ్ల క్రితం మద్రాసులో ప్రీ యూనివర్సిటీ కలిసి చదువుకున్నారిద్దరూ. చదువుకునే రోజుల్లో కూడా స్వప్నతో తనకి గొప్పగా స్నేహం కూడా లేదు. దానికి కారణం అంతస్తుల అంతరమే! తిండికి బట్టకీ లోటులేని గుమస్తా కూతురు తను. స్వప్న బాగా డబ్బున్నవాళ్లమ్మాయి. ఎప్పుడూ కాలేజీకి కారులోనే వచ్చేది. ఆ అమ్మాయి చుట్టూ ఎప్పుడూ అరడజను మంది అమ్మాయిలు ఉండేవారు. చదువుకునే రోజుల్లో తనకి మంచి మార్కులు వచ్చేవి. స్వప్న డబ్బు అందర్నీ ఆకర్షించి ఆకర్షిస్తే, తన తెలివితేటలు

క్లాసులో తనకో ప్రత్యేకతని తెచ్చి పెట్టాయి. చాలాసార్లు స్వప్న పలకరించి మాట్లాడినా, తనే తప్పుకు తిరిగేది. ఒకసారి స్వప్న తన పుట్టిన రోజంటూ పార్టీకి తనని ఆహ్వానించినట్లు గుర్తు. తను ఆ కంపెనీలో ఇమడలేననిపించి వెళ్లలేదు. లలితకి అన్నీ జ్ఞాపకం వచ్చి, అప్పటి తన మనస్థితికి నవ్వు వచ్చింది. అంతదాకా స్వప్న గూడా అదే ఆలోచిస్తోందేమో,

"ఏమిటి? కాలేజీ రోజులు జ్ఞాపకం తెచ్చుకుంటు న్నావా? నీకు సౌదామిని గుర్తుందా? లావుగా, పొట్టిగా ఉండేదీ, ఆ మధ్య ఢిల్లీలో కనిపించిందిలే!......." స్వప్న కారు డ్రైవ్ చేస్తూ యేవో పాత కబుర్లు గలగలా చెప్పేస్తోంది. కొన్ని గంటల క్రితం యెంతో దిగులుగా అనిపించిన లలిత మనసు, స్వప్న కనిపించడం యేదో ఉత్సాహాన్ని పుంజుకుంది. మనసు గతంలో యెక్కడో విహరిస్తోంది. స్వప్న చటుక్కున మాటలు ఆపి,

"లలితా! నువ్వు మారలేదు సుమా! అప్పుడూ యిలా మౌనంగానే ఉండేదానివి. నీ మౌనమే నన్ను ఆకర్షించేది. నీ గురించి తెలుసుకోవాలనిపించింది. అబ్బే! నువ్వెవరినైనా దగ్గరికి చేరనిస్తావా?" కారుని యేదో హొటలు కాంపౌండ్‌లోకి పోనిస్తోంది. కారు పార్క్ చేసి,

"నీకు అర్జంట్ పనేం లేదుగా? కాఫీ తాగుదాం!" అంది లలిత. 'పనా? తనకేం పని? అసలు యింటికి వెళ్లకుండా రాత్రంతా యిలా తిరుగుదామన్నా తను రెడీయే!" అనుకుంటూ పైకి,

"ఫరవాలేదు" అంది. సర్వరు కారు దగ్గరకే వచ్చాడు. స్వప్న టిఫెనుకి ఆర్డరిచ్చి,

"ఆఁ! ఇప్పుడు చెప్పు! ఏం చేస్తున్నావు? పెళ్లైందా?" అనడిగింది.

"అయింది."

"పిల్లలా? ఎంత మంది?"

"లేరు"

"ఏం? ఇప్పుడప్పుడే వద్దనుకున్నారేమో కదూ?" స్వప్న ఆసక్తిగా అడుగుతోంది. లలిత క్షణం సేపు మాట్లాడలేదు. మరో అర క్షణం తటపటాయించి,

"అదేం కాదు. పెళ్లయి అయిదేళ్లయింది" అంది.

"అయిదేళ్లలో ఒక్కసారి గూడా .... కనీసం అబార్షన్ లాంటిది కూడా అవలేదా?" స్వప్న కొంచెం సీరియస్‌గా అడిగింది. లలిత నవ్వేసి,

"భలే! డాక్టర్‌లాగా అడుగుతున్నావే?" అంది.

"మైగాడ్! నీకు చెప్పడం మరిచిపోయాను గదూ! అసలు నువ్వు అడిగితేగా చెప్పడానికి? నేను డాక్టర్నే! పియూ అయాక, ఎమ్.బి. చేశాను. ప్రస్తుతం నర్సింగ్ హొమ్ పెట్టుకున్నాను. గైనకాలజీ స్పెషలైజ్ చేస్తున్నాను లలితా! అందుకే అనుకోకుండా ప్రొఫెషనల్‌గా అడి గేశాను. ఏమనుకోకు!" అంది.

"ఛా! అనుకోవడం యెందుకూ? ఎంత మంది డాక్టర్లకో చెప్పాను. నీకు చెప్పడంలో తప్పేం ఉందిలే! అందరిదీ ఒకటే అభిప్రాయం. నాకు పిల్లలు కలిగే అవకాశం లేదు" అంది. ఎందుకో ఆ సంధ్యవేళలో స్వప్నతో అలా చెప్పుకుంటే లలిత మనసు తేలికైనట్లు అనిపించింది.

"కమాన్! ఎవరో యేదో చెప్పారని అలా అమ్మమ్మల్లా మాట్లాడకు! ఇప్పుడు వెళ్లేటప్పుడు, నా క్లినిక్ చూపిస్తాను. రేపొకసారి మీ ఆయన్ని తీసుకురా! అతన్నీ నాకు పరిచయం చేసినట్టవుతుంది. నీ సంగతీ చూడవచ్చు." అంది స్వప్న. లలిత సర్వరు అందించిన ప్లేటు అందుకుంటూ,

"ఆయన ఊళ్లో లేరు. కేంప్‌కి వెళ్లారు." అంది.

"ఇంతకీ మీ ఆయన ఉద్యోగమేమిటో చెప్పావు కాదు."

"మెడికల్ రిప్రజెంటేటివ్! నెలలో ఇరవై రోజులు కేంప్‌కి వెళ్ళిపోతారు. మొన్ననే వెళ్లారు. ఇంకో వారానికి గాని రారు. ఈ ఉద్యోగమే లేకపోతే ఒంటరితనంతో నాకు పిచ్చెక్కిపోయి ఉండేది."

"పోన్లే! అతని సంగతి తర్వాత చూద్దాం. రేపు వచ్చేటప్పుడు పాత రిపోర్టులన్నీ పట్టుకురా! మర్చి పోవద్దు!" స్వప్న బిల్లు పే చేసి కారు స్టార్టు చేసింది.

* * * * *

మర్నాడు స్వప్న నర్సింగ్‌హొమ్‌లో రౌండ్స్ ముగించుకుని వచ్చేసరికి, లలిత ఆమె కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చుని ఉంది.

"ఓ! లలితా! అయామ్ సారీ! ఆలస్యం అయి పోయింది. ఏవీ రిపోర్ట్సు తెచ్చావా?" అనడిగింది, లలితని చూడగానే. లలిత తల అడ్డంగా ఊపుతూ,

"పాత రిపోర్ట్సు దొరకలేదు స్వప్నా! మా ఆయన ఊళ్లో లేరు. ఎక్కడ పెట్టారో యేమో!" అంది. అలా అంటున్నప్పుడు స్వప్న లలిత వైపు పరీక్షగా చూసి ఉంటే లలిత మొహం వాడి ఉండటం గమనించి ఉండేది. కాని స్వప్న తన టేబిల్ మీదున్న కాగితాలు చూసుకుంటూ ఉండిపోయింది. లలిత మాట విని,

"డోంట్ వర్రీ! పాత రిపోర్టులున్నా యెలాగూ యింకోసారి అన్ని పరీక్షలూ చేయించాల్సి వచ్చేదే! జస్ట్! ఉంటే ఒకసారి యేం కాంప్లికేషన్సే చూద్దా మనుకున్నాను. అలా ఆ బల్ల మీద పడుకో! ఒకసారి రొటీన్ చెకప్ చేసేసి, మిగతా విషయాలు ఆలోచిద్దాం." అంటూ స్టెత్ తీసుకుని కుర్చీలోంచి లేచింది. స్వప్న అడుగుతున్న ప్రశ్నలకి యాంత్రికంగా సమాధానాలు చెప్తోందేగాని లలిత మనసు యెటో ఉంది. క్రితం రోజు యెంత వెతికినా ఆమెకి పాత రిపోర్టులు కనిపించలేదు. ఇంట్లోని కాగితాలన్నీ తలక్రిందులు చేశాక గాని, ఆమెకి, ఏనాడూ, తనెప్పుడూ, ఆ రిపోర్టులు చూడలేదన్న సంగతి జ్ఞాపకం రాలేదు. ప్రతీసారి పరీక్షలు అయ్యాక మోహన్ రిజల్ట్సు తెలుసుకుని వస్తాను అంటూ వెళ్లడం, ఆశగా యెదురు చూస్తున్న తనతో,

"సారీ లలితా! అంతా నెగెటివ్!" అనడం, తను నిరాశా, నిస్పృహల్లో మునిగిపోవడం! అంతేగాని యేనాడూ,

"ఏదీ ఆ రిపోర్ట్! డాక్టర్ యేమి రాసిందో చూస్తాను" అని అడిగి పుచ్చుకోలేదు. ఏనాడూ లేనిది భర్త పట్ల యేదో అనుమానపు బీజం ఆమె మనసులో మొలకెత్తసాగింది. కాని స్వప్న చెప్పబోయే విషయం తెలిసేదాకా ఆమె యేమీ ఆలోచించదలుచుకోలేదు. తన అనుమానాన్ని మనసులో ఒక మూలకి నెట్టేసి తెల్లారగానే స్వప్న దగ్గరికి పరిగెట్టుకు వచ్చేసింది. స్వప్న పరీక్ష ముగించి బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ,

"ఎక్సటర్నల్‌గా నీలో నాకేం లోపం కనిపించడం లేదు. అలాగని పూర్తి ఇన్వెస్టిగేషన్ చెయ్యకుండా ఒక నిర్ణయానికి రావడానికి కుదరదు. ఇన్వెస్టిగేషన్‌లో యెక్కడ లోపం ఉందో తెలుసుకుని, ట్రీట్‌మెంట్ ఉందా అని ఆలోచించాలి. కొన్ని పరీక్షలు రాసిస్తాను. ఒకటి రెండు ఇక్కడే చేస్తాను. కొన్ని మాత్రం బైట చేయించుకోవాల్సి ఉంటుంది. రిపోర్ట్సుని బట్టి అవసరం అయితే ఒకరోజు నర్సింగ్ హొమ్‌లో ఎడ్మిట్ కావాల్సి ఉంటుంది గూడా!" అంది. లలితకీ ఆ రొటీన్ చెకప్స్, ఇన్వెస్టిగేషన్స్ గురించి తెలుసు. అందుకే స్వప్న అలా అనగానే యెగిరి గంతు వెయ్యలేదు. స్వప్న వచ్చి తన కుర్చీలో కూర్చుని పెన్ను, పేడ్ అందుకుంటూ

"మీ ఆయన యెప్పుడూ వస్తారు?" అనడిగింది. లలిత ముభావంగా,

"తెలీదు. షెడ్యూల్ ప్రకారం అయితే నాలుగు రోజుల్లో రావాలి. వేరే ప్రోగ్రాం పడితే ఇంకా ఆలస్యం అవచ్చు." అంది. స్వప్న పెన్నుతో ఏదో రాస్తూ,

"ఒకర్తివీ వెళ్లి చేయించుకోగలవా? నేను ఫోన్ చేసి చెప్తాననుకో." అంది లలిత,

"ఫరవాలేదు. నాకు అలవాటే." అంది. స్వప్న రాయడం పూర్తి అయాక ప్రిస్క్రిప్షన్ మడిచి కవర్లో పెట్టి లలిత చేతికి యిచ్చి

"నాకు తెలిసిన లేబ్ అయితే ఫ్రీగా మాట్లాడటానికి ఉంటుందని డాక్టర్ రాజారాం గారి లేబ్‌కి రిఫర్ చేశాను. రేపు వెళితే చాలు. ఇవాళ యిక్కడ కొన్ని టెస్టులు చేసేద్దాం!" అంటూ మరో కాగితం మీద యేదో రాసి బెల్ కొట్టి నర్స్‌ని పిలిచి,

"ఈవిడని మన లాబ్‌కి తీసుకెళ్లు. ఇదిగో ప్రిస్క్రిప్షన్. లలితా! వెళుతూ ఉండు. బైట పేషంట్స్‌ని చూసేసి పది నిముషాల్లో నేను వచ్చేస్తాను" అంది. లలిత తల ఊపి నర్స్‌తో బైటకి నడిచింది.

* * * * *

"లలితా! నిన్ను యింతకు ముందు పరీక్ష చేసిన డాక్టర్లని కలుసుకోవాలనుంది. ఏ ఆధారంతో నీకు పిల్లలు పుట్టరని చెప్పారు? అసలు వాళ్లు డాక్టర్లేనా?" స్వప్న ఒకొక్కరి రిపోర్టూ చూస్తూ, ఆవేశంగా చెప్పుకుపోతోంది. లలిత మాట్లాడలేదు. స్వప్న చెప్తున్న సంగతి ఆమెకు విస్మయం కలిగించనూ లేదు. స్వప్న తలెత్తి చూస్తూ,

"కమాన్ లలితా! ఆర్ యూ నాట్ హేపీ!" అని అడిగింది. లలిత,

"ఎందుకు లేదూ? హేపీగానే ఉంది" అంది చిరునవ్వుతో. ఆ నవ్వులో జీవం లేదన్న సంగతి స్వప్న గమనించలేదు.

"ఆఁ! ఇప్పుడు ఈ సంగతి మీ ఆయనికి చెప్పి, 'నా రిపోర్ట్సు క్లియర్! వాటెబౌట్‌యూ?' అని అడుగు. అతను మెడికల్ రిప్ అన్నావుగా? అన్ని టెస్టులూ అతనూ చేయించుకునే ఉంటాడేమోలే! నీకు పరీక్ష చేసిన డాక్టర్ల లాంటివాళ్లు కాకపోతే చాలు. వీలైతే ఆ రిపోర్ట్సు ఒకసారి తీసుకురా చూద్దాం. మీ ఆయనింకా ఊరి నించి రాలేదా?" అని అడిగింది రిపోర్ట్సు కవర్లో పెట్టి లలిత చేతికి ఇస్తూ. లలిత వాటిని అందుకుని లేచి నిలబడి,

* * *

సీసాలు సీలు చేసేముందు బిరడాలను వేడినీటిలో ఉడకబెట్టండి. ఇవి కొంచెం వేడిగా ఉన్నప్పుడే సులభంగా నొక్కి పెట్టవచ్చు. ఇవి చల్లారినప్పుడు వాటంతట అవే గట్టిగా మూసుకు పోయి సీలు ఏర్పడుతుంది. తేమ లోపలకు ప్రవేశించడానికి వీలు ఉండదు.

బి.ఎస్.లక్ష్మి, అనంతపూర్

"స్వప్నా! చాలా థాంక్స్! వస్తాను." అంటూ స్వప్న ప్రశ్నకి సమాధానం చెప్పకుండానే కన్సల్టింగ్ రూమ్ దాటిపోయింది. లలిత ప్రవర్తనకి ఆశ్చర్యపోయిన స్వప్న తెల్లబోయి, లలిత వెళ్లాక యింకా ఊగుతున్న స్వింగ్ డోర్‌నే చూస్తూ ఉండిపోయింది.

* * * * *

"డాక్టర్! ఆవిడ వచ్చి చాలా సేపట్నించీ మీ కోసం కన్సల్టింగ్ రూమ్‌లో వెయిట్ చేస్తున్నారు." సిజేరియన్ ఆపరేషన్ ముగించి అలసటగా ఆపరేషన్ థియేటర్ నించి బైటికి వచ్చిన స్వప్నకి, కప్పులో కాఫీ పోసి అందిస్తూ చెప్పింది నర్స్. స్వప్న కప్పు అందుకుంటూ,

"ఎవరు?" అంది.

"అదే! ఆ రోజు వచ్చారే! మీ ఫ్రెండ్ అని చెప్పారు." అంది.

"ఓ! లలితా? లోపలికి రమ్మను." లలిత లోపలికి వస్తూ,

"ఆ రోజు అలా హఠాత్తుగా వెళిపోయానని నామీద కోపం లేదుగా స్వప్నా?" అని అడిగింది. స్వప్న ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసి అందిస్తూ,

"మూడీ పేషెంట్లు నాకు అలవాటే!" అంది కాఫీ సిప్ చేస్తూ,

"నీతో పర్సనల్‌గా మాట్లాడాలి స్వప్నా" అంది. స్వప్న చూపుని అర్థం చేసుకున్న నర్స్, నిశ్శబ్దంగా బైటికి నడిచింది. స్వప్న కుర్చీలో వెనక్కి వాలి కూర్చుంటూ,

"చెప్పు" అంది. లలిత యెలా మొదలుపెట్టడమా అన్నట్లు ఆలోచిస్తూ రెండు క్షణాలు చేతులు చూసుకుంటూ కూర్చుంది.

"చెప్పు లలితా! నేను డాక్టర్నే కాదు. నీ స్నేహితురాలిని కూడా! నువ్వు చెప్పబోయే విషయాలు ఈ నాలుగు గోడలూ దాటి బైటికి వెళ్లవని ప్రామిస్ చేస్తున్నాను" అంది యెంకరేజ్ చేస్తూ.

"స్వప్నా! ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ గురించి చాలా విన్నాను." స్వప్న ఆశ్చర్యంగా,

"అయితే?" అంది.

"ఏం లేదు. నేను ...... నాకు .... ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ చేయించుకోడానికి నువ్వు సహాయపడాలి." లలిత తల వంచుకుని మాట్లాడుతోంది. స్వప్న క్షణం సేపు లలిత వైపు నిశితంగా చూసి,

"లలితా! నానించి నువ్వేదో దాస్తున్నావు. ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ గురించి నీకెంత తెలుసో నాకు తెలీదు గాని, నువ్వు 'నాకో ఇంజక్షన్ చెయ్యి స్వప్నా' అన్నంత తేలిగ్గా అడిగేశావు. దానికి చాలా తతంగం ఉంది. ముఖ్యంగా నువ్వు ఒక్కర్తివీ ఒప్పుకుంటే చాలదు. మీ యిద్దరూ లిఖిత పూర్వకమైన హామీ పత్రం మీద సంతకం చేస్తే తప్ప ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్ చెయ్యడానికి కుదరదు" అంది. తల వంచుకుని స్వప్న మాటలు వింటున్న లలిత చివ్వున తలయెత్తి,

"ఇది అన్యాయం! కని పెంచేదాన్ని నేనయినప్పుడు మధ్యన ఆయన అనుమతి యెందుకూ!" అంది.

"పిల్లల మానసిక, శారీరక, సాంఘిక పెరుగుదలకి తల్లి దండ్రుల యిద్దరి ఆదరణ, ఆప్యాయత, అనురాగం ముఖ్యం గనుక." లలిత నిస్సహాయంగా స్వప్న వైపు చూసింది. తర్వాత నిట్టూరుస్తూ,

"నీ దగ్గర దాచడం యెందుకూ? పెళ్లయిన రెండేళ్ల దాకా మాకు పిల్లలు కలగలేదన్న విషయం మమ్మల్ని బాథించలేదు. పెళ్లయి మూడేళ్లయినా సంతానం కలగకపోయేసరికి, ఒకసారి అన్ని పరీక్షలు చేయించుకుని మాలో యెలాంటి లోపమూ లేదని తెలిస్తే ఆ భగవంతుడి మీద భారం వేసి ఊరుకోవాలనుకున్నాము. మా ఆయనకి ఈ ఊళ్లో చాలా మంది డాక్టర్లు తెలుసు. ఇద్దరం ఆయనకి తెలిసిన డాక్టర్ల చేత పరీక్ష చేయించుకున్నాము. మా ఆయన,'సారీ లలితా! లోపం నీలోనే ఉందని తెలిసింది. బాధపడకు! నా స్నేహితుడు ఒక లేడీ డాక్టరు పేరు చెప్పాడు. ఆవిడ దగ్గరకి వెళ్లి చూద్దాం.' అంటూ రిపోర్ట్సు నాకు చూపించకుండా చెప్తే, నేను పూర్తిగా నమ్మాను. ఇలా ఒకసారి కాదు. చాలాసార్లు జరిగింది. నిన్ను కలుసుకునే దాకా ఆయన మీద అనుమానం కలగలేదు. నాకే మాత్రం సందేహం కలిగివున్నా నా అంతట నేనే రిజల్ట్సు తెలుసుకోడానికి ప్రయత్నించి ఉండేదాన్ని. ఇప్పుడు చెప్పు! ఇన్నాళ్లూ ఇలా నన్ను మోసం చేసిన ఆయనకి తెలియకుండా నేను గర్భవతినయి, ఆయన కక్కలేక మింగలేక విలవిల్లాడేటట్లు చెయ్యాలనుకోవడంలో తప్పేమయినా ఉందా?" అంటూ ఆవేశంగా చెప్పుకుపోతున్న లలిత వైపు పసిపిల్లని చూసినట్లు చూసింది స్వప్న.

"నీ పట్టుదల అర్థం లేనిది లలితా! అతను తనలోని లోపాన్ని కప్పిపుచ్చుకుని తప్పు నీ మీదికి నెట్టడం అపరాధమే! కాదనను. కాని దానికి ఇంత శిక్ష అనవసరం. నేనిచ్చిన రిపోర్ట్సు చూపించి నాలుగూ అడిగి కడిగేసెయ్యి! నీ ఆవేశం చల్లారుతుంది. తర్వాత అతను ఒప్పుకుంటే ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్‌కి నేను యేర్పాటు చేస్తాను."

"సారీ స్వప్నా! నా నిర్ణయం మారదు. నేను ఆయన్ని యేమీ అడగదలుచుకోలేదు. ఇన్నాళ్లూ నేనెంత క్షోభ అనుభవించానో నీకు అర్థం కాదు. నేను గర్భవతినని తెలిసినప్పుడు మింగలేక కక్కలేక ఆయన గిలగిల్లాడిన నాడుకాని నా కసి తీరదు. స్నేహితురాలివనీ, సాటి స్త్రీగా సహాయం చేస్తావనీ నీ దగ్గరకి వచ్చాను. అంతే గాని, ఈ రోజుల్లో డబ్బుతో జరగని పని లేదని నీకూ తెలుసు." అంతా నిర్ణయించుకు వచ్చిన దానిలాగా లలిత మాట్లాడుతూ ఉంటే స్వప్న రెండు క్షణాలు యేం మాట్లాడాలో తెలియని దానిలాగా నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది. ఆఖరికి యేదో నిశ్చయించుకున్న దానిలాగా,

"ఓ.కే! నీ పంతమే నీదైనప్పుడు నేను చెప్పేదేం లేదు. కాకపోతే ఇలాంటి నిర్ణయాల వల్ల నీ సంసారం యేమవుతుందో మరోసారి ఆలోచించుకో! అన్ని యేర్పాట్లు చెయ్యడానికి నాకూ ఓ పది రోజులు టైమ్ కావాల్సి ఉంటుంది. నేను ఇంతదాకా చట్ట విరుద్ధంగా యే పనీ చెయ్యలేదు. మొదటిసారి నీ కోసం నా పలుకుబడి అంతా ఉపయోగించి ఈ పని చెయ్యాలి" అంది. లలిత కళ్లు ఆనందంతో మెరిశాయి.

"థేంక్యూ సప్నా! నా సంసారం గురించి ఆలోచించి అనవసరంగా నీ మనసు పాడు చేసుకోకు. నాకు మోహన్ మనస్తత్వం బాగా తెలుసు. అలా కాక యేమైనా కలతలు వచ్చినా తట్టుకోగల మానసిక, ఆర్థిక బలం నాకు ఉంది. ఆ సంగతి మోహన్‌కి కూడా బాగా తెలుసు. అన్నిటికంటే ముఖ్యంగా భవిష్యత్తులో నీకెలాంటి ఇబ్బందీ రాకుండా చూసే బాధ్యత నాది."

"అంత మాత్రం హామీ యిస్తున్నావు. అంతే చాలు. పది రోజుల తర్వాత ఫోన్ చెయ్యి. ఎప్పుడు నా దగ్గరికి రావాలో చెప్తాను". లలిత వెళ్లిపోయిన చాలా సేపటి దాకా ఆలోచిస్తూ కూర్చున్న స్వప్న ఒక నిర్ణయానికి వచ్చిన దానిలాగా టెలిఫోన్ డైరెక్టరీ తీసి తనకి కావలసిన నెంబరు కోసం వెతకసాగింది.

* * * * *

"స్వప్నా! నేను అనుకున్నట్లు జరగలేదు." చిన్న వేయింగ్ స్కేల్‌లో పాపాయి బరువు చూస్తున్న స్వప్న

"గుడ్! నెల రోజులకి పెరగవలసినంత బరువు పెరిగింది........." అంది.

"స్వప్నా! నేను చెప్తున్నది నువ్వు వినిపించుకోవటం లేదు. నేను అనుకున్నట్లు జరగలేదు."

"బాగుంది! పండంటి పాపాయిని కని, నేను అనుకున్నట్లు జరగలేదంటావేం?" అంది స్వప్న పాపాయిని లలిత చేతుల్లో పెడుతూ చిరునవ్వుతో. లలిత రోషంగా స్వప్న వైపు చూసి,

"మోహన్ చాలా సంతోషంగా ఉన్నాడు. నేను యెదురు చూసిన తుఫాన్లు, సుడిగాలులు చెలరేగ లేదు."

"అయితే బాధెందుకూ? నీ కోరిక తీరిందిగా! నువ్వు సంతోషంగా ఉండు."

## పారేసే బ్రష్‌తో కొన్ని ఉపయోగాలు

1. నగలు తోముకోవచ్చు. గాజులు, ఉంగరాలు, పట్టీలు కుంకుడు రసంతో తోమితే తళ తళ మెరుస్తాయి.
2. స్ప్రే - పెయింటింగ్ చేయవచ్చు
3. సింకులు తోముకోవచ్చు
4. గ్యాస్ స్టవ్వుల చక్కీలు, బర్నర్‌లు తోమవచ్చు.
5. ఇనుప చువ్వల కిటికీలను శుభ్రపరచవచ్చును.
6. బాత్ రూములలో టైల్స్‌ని మూలల్లో శుభ్రపరచవచ్చును.
7. దువ్వెనలు క్లీన్ చేయవచ్చు
8. ప్లాస్టిక్ బుట్టలు క్లీన్ చేయవచ్చు
9. కాళ్ళు గోరువెచ్చని నీళ్ళలో పెట్టిన తరువాత మట్టిని పోయేలా రుద్దుకోవచ్చు.
10. ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, సోపు కేసులు వగైరా జిడ్డుగా ఉన్నవి తెల్లగా తోమవచ్చు.
11. టీవి, టేప్-రికార్డర్ సందులలో దుమ్ము తుడుచుకోవచ్చును.
12. నల్లాలకి పాకుడు, మట్టి వదిలించవచ్చును.
13. కుక్కరు వెయిట్ కింద తోమవచ్చును.
14. వంటింటిలో ఉన్న సింకులో ఏసిడ్ వేసి కాసేపైన తరువాత బ్రష్‌తో క్లీన్ చేస్తే అప్పుడే కట్టిన దానిలా తయారౌవుతుంది.
15. బంగారు గాజుల వెనుక చేరిన మట్టిని సులభంగా తోమవచ్చును.
16. మూకుడు చెవులను తోమవచ్చును.
17. టీ వడపోసే ఫిల్టర్‌లోగల చిన్న జల్లెడ తోమవచ్చును.

— పి. విజయలక్ష్మిమురళీధర్, హైదరాబాద్

"స్వప్నా! నువ్వేదో నాటకం ఆడావు. ఆడుతున్నావు! నాకు తెలుసు."

"బాగుంది. ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్లు, మధ్యన ఆడిపోసుకోవటానికి నేను దొరికానా?"

"నిజం చెప్పు స్వప్నా! ఏం జరిగింది? మోహన్ యేం జరగనట్లు ఎలా ఉండగలుగుతున్నాడు?" అంది లలిత బ్రతిమాలుతున్నట్లు. స్వప్న సీరియస్‌గా లలితవైపు చూసి.

"మోహన్ పట్ల ఇంకా నీ కోపం తగ్గలేదా లలితా?" అని అడిగింది. లలిత సమాధానం చెప్పలేదు.

"సమాధానం చెప్పు లలితా! ఇంచుమించు సంవత్సరం అయిపోయినా, ఇంకా నువ్వు పాత సంగతులన్నీ మనసులో పెట్టుకు బాధపడుతున్నావా?" లలిత తల అడ్డంగా ఊపుతూ,

"అదేం లేదు. నీ ధర్మమా అని పాపాయి కడుపున పడ్డ వెంటనే నా బాధలన్నీ మంత్రించినట్లు మాయం అయిపోయాయి. ఇప్పుడు కేవలం కుతూహలం కొద్దీ అడుగుతున్నాను. మోహన్‌ని అడిగే ధైర్యం నాకు లేదు" అంది. స్వప్న రెండు నిముషాలు యేదో ఆలోచిస్తున్నట్లు ఊరుకుని,

"నువ్వేదో నీ కోపంలో నీ భర్తకి తెలియకుండా, ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్ ద్వారా పిల్లని కని కసి తీర్చుకుందామనుకున్నావు గాని, అది అంత సులభం కాదని నాకు తెలుసు. కాకపోతే, ఈ మాయదారి దేశంలో నువ్వు బెదిరించినట్లూ డబ్బుతో జరగని పని లేదు. నేను కలుగజేసుకోపోతే నువ్వు వెళ్లి యెలాంటి డాక్టర్ల చేతుల్లో పడతావో, దాని పరిణామాలు యెలా ఉంటాయో అని భయపడి నేను నీ షరతుకి ఒప్పుకున్నాను. కాని చెప్పానుగా, చట్ట విరుద్ధంగా, నా పరపతి ఉపయోగించి ఈ పని చెయ్యడానికి నా మనసు ఒప్పుకోలేదు. ఏమైతే అది అయింది, ఒకసారి నీ భర్తతో మాట్లాడి అతని అభిప్రాయం తెలుసుకోవడం మంచిదనిపించింది. నేను నీ స్నేహితురాలిగా కాకుండా, ఒక డాక్టర్‌గా అతని పరిచయం ఒక స్నేహితుడి ద్వారా సంపాదించాను. ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ యిన్‌సెమినేషన్ గురించి అతని అభిప్రాయం తెలుసుకున్నాను. నీ భర్త చదువుకున్నవాడు, పైగా కొంత వరకూ మా లైన్లో ఉన్నాడు. పర పురుషునితో శారీరక సంబంధం లేకుండా, ఈ మెడికల్ పద్ధతి ద్వారా పిల్లల్ని కనడం గురించి నేను అతనికి యెక్కువగా విడమరచి చెప్పాల్సిన అవసరం లేకపోయింది. అతను ఈ పద్ధతికి యెంత మాత్రం విముఖుడు కాదని తెలుసుకుని, మన యిద్దరి స్నేహం నీ కోపం వగైరాల సంగతి చెప్పాను. అతని మాటల వల్ల అతని బలహీనత యేమిటో అర్థం అయింది. తనలోని లోపం వల్ల తనపట్ల నువ్వు విముఖురాలివైపోతావేమోననే భయం వల్లే అతను నీతో అబద్ధం చెప్పాడన్న సంగతి నాకు తెలిసింది. 'లలిత కోరిక ప్రకారమే కానివ్వండి. ఈ విషయం నాకు తెలియనివ్వకూడదని లలిత అనుకుంటే ఆలాగే కానివ్వండి. నేనూ నాకు తెలియనట్లే ఉంటాను. ఇంతకాలం ఈ వృత్తిలో ఉండి నాకీ విషయం తట్టకపోవడం వల్ల లలితని ఇంత మానసిక క్షోభకి గురి చెయ్యాల్సి వచ్చింది' అంటూ అతను తన అంగీకారం తెలిపాక గాని నేను ఈ విషయంలో ముందడుగు వెయ్యలేదు. నీ సందేహాలు, సంశయాలూ అన్నీ తీరినట్లేనా? ఇంకా యేమైనా ఉన్నాయా?" అంటూ స్వప్న చెప్పడం ముగించగానే లలిత చేతుల్లోని పండంటి పాపాయి తనకేదో అర్థం అయినట్లు కిలకిల కేరింతలు కొట్టింది.

# అంధుల పాలిటి జీవన జ్యోతి
# ఆంధ్రా బ్లైండ్ మోడల్ హైస్కూలు



సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ బి. ఇజ్రాయెల్


ప్రపంచంలోని అంధులలో ఐదవ వంతు మన భారత దేశంలో ఉన్నారు. వీరికి విద్యా విజ్ఞానాలు అందచేయాలని ప్రభుత్వంతో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేస్తున్నాయి - వాటిలో ఒకటి - ఆంధ్రా బ్లైండ్ మోడల్ హైస్కూలు.

నరసాపురం పట్టణంలో 1961లో దీనిని రెవరెండ్ శ్రీ బి. ఇజ్రాయెల్ దంపతులు ఒకే ఒక విద్యార్థితో ప్రారంభించారు. ఈ సంస్థ దినదిన ప్రవర్థమానమై నేడు 100 మంది అంధ విద్యార్థులకు విద్యాజ్ఞానం కల్గిస్తున్నది. తాము అంధులమన్న ఆలోచనగాని విచారం కాని వీరికి కలుగకుండా తీర్చి దిద్దుతున్నది. ఇందులో చదువుకున్న వారు వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. పుట్టు గుడ్డి వారైన బాల బాలికల్ను 5 సంవత్సరములలోపులో "గ్లకోమా" వంటికొన్ని ప్రమాదకరమైన వ్యాధుల వల్ల కంటి చూపు కోల్పోయిన వారు 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు బ్రెయిలి లిపిలో విద్యను అభ్యసిస్తు న్నారిక్కడ. ప్రతి తరగతికి కనీసం పది మంది విద్యార్థులు తక్కువ కాకుండా ఉంటారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఏలూరులోనూ, గత సంవత్సరం నవంబరు నెలలో బొంబాయిలో జరిగిన జాతీయ అంధుల ఆటల పోటీలలోను అనేక బహుమతులు ఈ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు గెలుచుకున్నారు.

ఒక్క విద్యా బోధనే కాకుండా వృత్తి విద్యా శిక్షణ కోర్సుగా చేనేత, తివాసిలు నేయటం. కొవ్వొత్తులు, సుద్దముక్కలు తయారీ మొదలైన కుటీర పరిశ్రమల్లోనూ వీరికి శిక్షణ ఇస్తూ బ్రతకటానికి ఒకదారి చూపిస్తున్నారు.

1987లో అప్పటి రాష్ట్ర గవర్నర్ కుముద్ బెన్ జోషి ఈ స్కూలు రజతోత్సవాలకు హాజరై పాఠశాల ప్రగతిని అభినందించారు.



దుప్పట్లు నేస్తున్న అంధ విద్యార్థిని.



కొవ్వొత్తులు తయారు చేస్తున్న అంధ విద్యార్థి

వీరికి ఉచిత భోజన వసతితో పాటు పాఠ్య పుస్తకాలు, విదేశాల నుంచి ప్రత్యేకంగా పంపిన ప్రపంచ పటాలు గ్లోబులు వారి విజ్ఞానాన్ని మరింతగా పెంచుతున్నాయి.

మామూలు విద్యార్థులకు ఎందులోనూ తీసిపోము అని ఈ సంవత్సరం జరిగిన పదవ తరగతి ఏడవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం పాసయి రికార్డు సృష్టించారు. ఈ పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో 7 ఫస్ట్ క్లాస్‌ల్లో 6 సెకండ్ క్లాస్‌ల్లో పాస్ కావటం మరో విశేషం.

డాక్టర్ చినయిల్లి సత్యనారాయణ రావు, డాక్టర్ డి. యస్. మూర్తి, (కంటివైద్యులు), డాక్టర్ కె. నాగభూషణంలు ఈ పాఠశాల విద్యార్థులకు ప్రతి సంవత్సరం వైద్య సేవలు అందిస్తున్నారని సంస్థ వ్యవస్థాపకులు శ్రీ బి. ఇస్రాయెల్ తెలిపారు. ఈ సంస్థ అధ్వర్యంలోనే విశాఖపట్నంలో ఒక అంధుల పాఠశాల నడుపబడుతోంది.

ఎల్. వెంకటరత్నం



క్రీడలలో బహుమతులు పొందిన విద్యార్థులు